# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**వ్యవసాయ మార్కెట్‌లో విశ్రాంతి గదులను ప్రారంభించిన హోంమంత్రి మహమూద్ అలీ**



మలక్‌పేట వ్యవసాయ మార్కెట్లో కవర్ షెడ్, రైతు విశ్రాంతి భవనాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ

మలక్‌పేట, అక్టోబర్ 7 : బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమని హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. శనివారం మలక్‌పేటలోని వ్యవసాయ మార్కెట్లో రూ. 1.10 కోట్లతో నిర్మించిన కవర్ షెడ్, రైతు విశ్రాంతి గదులను శనివారం ఆయన ప్రారంభించారు. రైతుల విశ్రాంతికోసం విశాలమైన భవనంతోపాటు మంచాలు, బెడ్లను ఏర్పాటుచేయటం అభినందనీమని, మార్కెట్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లకు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నానని అన్నారు. మార్కెట్లో రూ. 33 లక్షల ఎమ్మెల్యే నిధులు, రూ.20 లక్షల మార్కెటింగ్ శాఖ నిధులతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రూ.32 లక్షలతో కవర్ షెడ్, రూ.10 లక్షలతో రైతు విశ్రాంతి భవనం, రూ.20 లక్షలతో మార్కెట్ యార్డులకు మెట్లు నిర్మించటం జరిగిందని మంత్రి తెలిపారు. సీఎం కేసీఆర్ పటిష్ట నాయకత్వంలో అన్నిరంగాల్లో పురోభివృద్ధిని సాధించి బంగారు తెలంగాణగా అవతరించిందని పేర్కొన్నారు

**పదే పదే దొంగతనాలకు పాల్పడితే పీడీ యాక్ట్**

మార్కెట్లో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, రైతులకు డబ్బులు దొంగాలిస్తున్నారని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చైరపర్సన్ అనితా నాయక్ కోరారని, వెంటనే తాను డీసీపీకి చెప్పి చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించటం జరిగిందని మంత్రి తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో కఠినంగా వ్యవహరించాలని, ఒకటి, రెండు సార్లు దొంగతనాలకు పాల్పడితే అరెస్ట్‌చేయాలని, అయినప్పటికీ మార్పు లేకుండా అలాగే పాల్పడితే పీడీయాక్ట్ ప్రయోగించాలని ఆదేశించామని అన్నారు.

కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, మలక్‌పేట మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి, ఉప సంచాలకులు దామోదర్, గ్రేడ్-3 కార్యదర్శి రవీందర్ రెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ ఆంగోతు అనితా నాయక్, వైస్ చైర్మన్ కొరుడు భూమేశ్వర్, డైరెక్టర్లు మైల రవీకాంత్, సల్మాన్ మహ్మద్‌ఖాన్, ఎజాజ్, అభిషేకం, రాముయాదవ్, బట్కిరి విద్యానంద్, యాదగిరి, మాణిక్‌రావు, రాహుల్, నరేశ్, మాజీ డైరెక్టర్లు ప్రవీణ్, రవీందర్‌రెడ్డితోపాటు మార్కెటింగ్‌శాఖ అధికారులు, మార్కెట్ సిబ్బంది, బీఆర్‌ఎస్ మలక్‌పేట నియోజకవర్గ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సునరితారెడ్డి, రఘునందన్‌రెడ్డి, పాత మలక్‌పేట డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కామేశ్, జాగృతి నాయకురాలు తిరునగరి రాధ, లలిత, శశిధర్‌రావు, నర్సింగ్, నక్క అమరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

## బతుకమ్మ చీరల పంపిణీ



ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సరస్వతీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం కార్పొరేటర్ జంగం శ్వేత బతుకమ్మ చీరలను అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. అర్హులైన మహిళలందరికీ చీరలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, సెక్రటరీ చెన్నారెడ్డి, ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, రత్నాకర్ పాల్గొన్నారు.- **సైదాబాద్, అక్టోబర్ 7**

## నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఏకలవ్య బస్తీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ కొత్తకాపు అరుణ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అధికారులు సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. పనుల్లో లోపాలు ఉంటే తన దృష్టికి తీసుకొని రావాలని స్థానికులకు తెలిపారు. కార్యక్రమంలో రమన్ సింగ్, బస్తీవాసులు పాల్గొన్నారు. **- సైదాబాద్, అక్టోబర్ 7**

## 9న జువైనల్ పెట్రోల్ పంప్ ప్రారంభం



గాజుల రామారాంలో జువైనల్ స్పెషల్ హోం ఆవరణలో ఏర్పాటు చేసిన పెట్రోల్ పంప్

సైదాబాద్, అక్టోబర్ 7 : బాలుర స్పెషల్ హోం (జువైనల్ – గాజుల రామారాం) ఆవరణలో రెండు కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన పెట్రోల్ పంప్ ఔట్ లెట్‌ను సోమవారం ఉదయం రాష్ట్ర మంత్రులు ప్రారంభించనున్నారని జువైనల్ కరెక్షనల్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మిర్జా రజా బేగ్ తెలిపారు. శనివారం సైదాబాద్‌లోని జువైనల్ కరెక్షనల్ డైరెక్టర్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. గాజుల రామారాంలోని జువైనల్ స్పెషల్ ఆవరణలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులు జువైనల్ డిపార్ట్‌మెంట్ ఉమ్మడి భాగస్వామ్యంతో పెట్రోల్ పంప్‌ను ఏర్పాటు చేశారు.సత్ప్రవర్తన కలిగి శిక్ష పూర్తిచేసి విడుదలైన బాలురుకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం పెట్రోల్ పంప్‌లను ఏర్పాటు చేస్తుంది. గాజుల రామారాంలోని ప్రత్యేక బాలుర సదనంలో పెట్రోల్ పంప్ నిర్మించటానికి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ ముందుకు రావటంతో ఏర్పాటు చేశారు.

**20 మందికి అవకాశం ..**

పెట్రోల్ పంప్ ఏర్పాటుతో జువైనల్ డిపార్ట్‌మెంట్‌కు నెలకు లక్ష రూపాయల ఆదాయం, స్థలానికి అద్దె వస్తుందన్నారు. ప్రతి ఒక్కరికీ రూ.15 వేలు జీతం కాకుండా ఇక్కడే వసతి సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. 20 మందికి అవకాశం కల్పిస్తున్నామని, ఇదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో పెట్రోల్ పంప్‌లు, అబ్జర్వేషన్ హోంలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని తెలిపారు. సోమవారం ఉదయం పెట్రోల్ పంప్ ఔట్ లెట్‌ను రాష్ట్ర మంత్రులు మల్లారెడ్డి, సత్యవతి రాథోడ్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద, ఎంపీ రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, కె. జనార్దన్ రెడ్డి, సురభి వాణీదేవి, కె. నవీన్‌కుమార్, జువైనల్ వెల్ఫేర్ కరెక్షనల్ సర్వీసెస్, వెల్ఫేర్ ఆఫ్ స్ట్రీట్ చిల్డ్రన్స్ కమిషనర్ భారతి హోలికేరి, దుండిగల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ సుంకరి కృష్ణవేణి కృష్ణ, వైస్ చైర్మన్ పద్మారావు, కలెక్టర్ అమోయ్ కుమార్, బాలుర స్పెషల్ సూపరింటెండెంట్ సంగమేశ్వర్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు.

## హనుమాన్ ఆలయంపై స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణం వద్దు



హనుమాన్ ఆలయంపై భాగంలో ఏర్పాటు చేస్తున్న ఎస్ఆర్‌డీపీ స్టీల్ బ్రిడ్జి పనులు చేయరాదంటూ శనివారం స్థానికులు, భక్తులు ఆందోళన చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సహదేవ్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. చంచల్‌గూడ ప్రభుత్వ ముద్రణాలయం చౌరస్తా నుంచి సంతోష్‌నగర్ వరకు నిర్మించే బ్రిడ్జితో సైదాబాద్ హనుమాన్ ఆలయానికి అపచారం జరుగుతుందన్నారు. గతంలో ఆలయం ఎదురుగా పిల్లర్ ఏర్పాటును భక్తులు అడ్డుకోవటంతో మరో ప్రాంతానికి మార్చారన్నారు. ఇప్పుడు ఏకంగా ఆలయంపై భాగంలో రోడ్డు వెళ్లే విధంగా చేయడం దారుణమన్నారు.

**- సైదాబాద్, అక్టోబర్ 7**

## తాగునీటి లైన్ల సమస్యకు పరిష్కారం



డ్రైనేజీ, తాగునీటి లైన్ల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించనున్నట్లు మలక్‌పేట ఎమ్మెల్యే అబ్దుల్లా బలాల తెలిపారు. మూసారాంబాగ్ బస్తీ, రాజరాజేశ్వరీ ఆలయ వీధి, గడ్డిఅన్నారంలోని కాలనీల్లో తాగునీరు, డ్రైనేజీ లైన్లు, రోడ్ల నిర్మాణ పనులకు శనివారం కార్పొరేటర్ బి.భాగ్యలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి, బి.మధుసూదన్‌రెడ్డి, డివిజన్ నాయకులు గండి కృష్ణయాదవ్, సంగిరెడ్డి, ముజ్జు పాల్గొన్నారు. **- మలక్‌పేట, అక్టోబర్ 7**

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బండ్లగూడ, అక్టోబర్ 7: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గోకరి సురేశ్‌గౌడ్ పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్ పరిధిలోని పలువురు విద్యార్థులు ఈ నెల 16 నుంచి 22 వరకు దుబాయ్‌లో జరగనున్న అండర్-15 గోల్ఫ్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌కు జశ్వంత్, శాన్వి, వేదాంత్, అపూర్వ, రిత్విక్, విఘ్నేశ్ ఎంపికయ్యారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు సురేశ్‌గౌడ్, ప్రేమ్‌గౌడ్ వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కోచ్ ప్రణిత్‌కుమార్,రాఘవ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన భరత నాట్యం



భరత నాట్య కళాకారిణి కళాకృతి నాట్యాలయ వ్యవస్థాపక సంచాలకురాలు భారతీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం దశమ వార్షికోత్సవం రవీంద్రభారతిలోని ప్రధాన కళావేదికపై నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆదాయ పన్నుల శాఖ కమిషనర్ జీవన్‌లాల్ లవిడియా, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ , కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత ప్రఖ్యాత ఆంధ్రనాట్య నిపుణులు కళాకృష్ణ,పలువురు నృత్యోత్సవాల సంచాకులు సాయివెంకటేశ్,(కర్నాటక), బత్తిన రంగ విక్రమ్ కుమార్ విచ్చేశారు. **- రవీంద్రభారతి,అక్టోబర్ 7**

## 11న పాటల పోటీలు

రవీంద్రభారతి, అక్టోబర్ 7 : తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో 11 న రవీంద్రాభారతిలో కళావేదిక మ్యాగజిన్ వారి ఆధ్వర్యంలో పాటల పోటీలు నిర్వహించనున్నారు. ' ద వాయిస్ ఆఫ్ కళావేదిక ' పై పోటీల్లో పాల్గొని ప్రతిభను నిరూపించుకోవాలని కళావేదిక సాంస్కృతిక సంస్థ నిర్వాహకురాలు రాయపరపు భువన అన్నారు. పోటీల్లో పాల్గొనే గాయకులు 8886479118 నంబర్‌లో సంప్రదించాలని భువన కోరారు.

## మాదన్నపేట కూరగాయల మార్కెట్ ధరలు



| కూరగాయలు | కిలో రూ. | కూరగాయలు | కిలో రూ. |
|---|---|---|---|
| ఆలుగడ్డ | 20 | సొరకాయ | 10 |
| టమాట | 16 | క్యాబేజ్ | 12 |
| వంకాయలు | 20 | క్యారట్ | 30 |
| బెండకాయ | 20 | క్యాలీఫ్లవర్ | 20 |
| మిర్చి | 30 | దొండ | 20 |
| గోకరకాయ | 20 | కీర | 25 |
| చిక్కుడు | 40 | దోసకాయ | 25 |
| బిన్నీస్ | 40 | క్యాప్సికమ్ | 34 |
| బీరకాయ | 20 | బీట్‌రూట్ | 20 |
| కాకరకాయ | 20 | | |

ఈ ధరలు నేటి ఉదయం 9.30గంటల వరకు కూరగాయల మార్కెట్‌లో అమలులో ఉంటాయని అధికారులు తెలిపారు